www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 24 అక్టోబర్ 2025
5

డ్రెయినేజీ పనులకు భూమిపూజ

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని శివానందపురం 15వ డివిజన్ మెయిన్ రోడ్డులో 15వ ఫైనాన్స్ నిధుల ద్వారా రూ.15 లక్షల వ్యయంతో చేపట్టిన డ్రెయినేజీ పనులకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ కడప నగరంలో మౌలిక వసతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ప్రతి డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. నగరంలోని కాలువలు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరచడం ద్వారా వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను తగ్గించడమే లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కో-ఆప్షన్ సభ్యుడు నాగిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, నవనీశ్వర్‌రెడ్డి, రెడ్డయ్య యాదవ్, మద్దూరు రాయుడు, షరీఫ్, రమణ, రాజోలు శివశంకర్, చంద్రారెడ్డి, వినోద్‌కుమార్ రెడ్డి, ఈశ్వరయ్య, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నష్టం మిగిల్చిన వర్షం

- 6,697 ఎకరాల్లో పంట నష్టం
- 4,990 ఎకరాల్లో నేలకొరిగిన వరి పంట
- కడప జిల్లాలో 6,572 ఎకరాలు

ఉభయ జిల్లాలో అల్పపీడన ప్రభావం

అపార నష్టాల్ని మిగిల్చింది. కడప, అన్నమయ్య జిల్లాల పరిధిలో 6,697 ఎకరాల్లో తీవ్రనష్టం వాటిల్లింది. కోతదశలో ఉన్న వరి, వేరుశనగ, మినుములు, కంది, జొన్న, పత్తి పంటలపై అధిక ప్రభావం కనిపించింది. కడప జిల్లాలోని 16 మండలాల్లోని ఆరు రకాల పంటలు వర్షార్పణం కావడం ఆందోళన కలిగిస్తోంది. కడప, అన్నమయ్య జిల్లాల పరిధిలో దెబ్బతిన్న పంటలకు వాటిల్లిన నష్టాన్ని ఆయా జిల్లాల వ్యవసాయ శాఖలు 33 శాతం పైగా నష్ట పోయిన పంటలను ప్రైమరీ ఎన్యూమరేషన్ చేశాయి. అల్పపీడన ప్రభావం బారిన పడిన పంటలను పూర్తి స్థాయిలో పరిగణలోకి తీసుకుని లెక్కిస్తే నష్టాల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

రాజంపేట : వర్షానికి నేలకొరిగిన వరి పంట

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప, అన్నమయ్య జిల్లాల్లో 6,697 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లింది. నాలుగు రోజుల కిందట బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ధాటికి కడప జిల్లాలో 6,572 ఎకరాలు, అన్నమయ్య జిల్లాలో 125 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వెరసి 6,697 ఎకరాలు వరి, వేరుశనగ, మినుములు, జొన్న, కంది, పత్తి పంటలపై ప్రభావం కనిపించింది. ఉభయ జిల్లాల వ్యవసాయ శాఖలు ఎన్యూమరేషన్ చేశాయి. కడప జిల్లాలోని 16 మండలాల పరిధిలోని 71 గ్రామాల పరిధిలో పంటలు దెబ్బతిన్నాయి. కడప జిల్లాలో అత్యధికంగా 6,572 ఎకరాల్లో వరి, 4,865 ఎకరాల్లో వేరుశనగ, 563 ఎకరాల్లో మినుములు, 98 ఎకరాల్లో జొన్న, 200 ఎకరాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కడప, అన్నమయ్య జిల్లాలో 4,990 ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. అన్నమయ్య జిల్లా చిట్వేలి, నందలూరు, రాజంపేట మండలాల పరిధిలోని గ్రామాలకు చెందిన 117 మందికి చెందిన 125 ఎకరాల్లో వరి పంటకు రూ.72.5 లక్షల మేర నష్టం వాటిల్లింది. నందలూరు మండల పరిధిలోని పాటూరు, నల్లదిమ్మాయపల్లి, పొత్తపి గ్రామాలకు చెందిన 43 మంది రైతులకు చెందిన 18 ఎకరాలు, రాజంపేట మండలానికి చెందిన అప్పరాజుపేట, తాళ్లపాక గ్రామాలకు చెందిన 13 మందికి చెందిన 16 ఎకరాలు, పెనగలూరు మండల పరిధిలోని నారాయణ నెల్లూరు, కోమంత రాజపురం గ్రామానికి చెందిన 61 మంది రైతులకు చెందిన 16 ఎకరాలు వెరసి 125 ఎకరాల్లో 117 మంది రైతులకు చెందిన వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది.

రెండు ఎకరాల్లో సాగు చేసి నష్టపోయాం

ఖరీఫ్ సీజన్‌లో రెండు ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేపట్టాను. ప్రస్తుతం పంట నూర్పిడి పనులు చేశాం. విత్తనాలు ఆరబెట్టేందుకు నాలుగు రోజులుగా తీవ్ర అవస్థలు పడుతున్నాం. పంట పొలాల వద్ద ఆరబెట్టే అవకాశం లేకపోవడంతో కడప- కర్నూలు హైవే రోడ్డుపై దాన్యాన్ని కుప్పలుగా పోసి ప్లాస్టిక్ పట్టలు కప్పి ఉంచాం. వర్షం ఇలానే రెండు రోజులు పడితే విత్తనాలు దెబ్బతిని రూ. 50 వేల వరకు నష్టం వచ్చే పరిస్థితి ఏర్పడింది.

- సుబ్బమ్మ ,మొక్కజొన్న రైతు లింగాలదిన్నె.

ప్రభుత్వం ఆదుకోవాలి

మూడు ఎకరాల్లో చిట్టి ముత్యాల వరి పంట నీటిపాలై నాశనమైంది. గొల్లపల్లెకు వెళ్లే మార్గంలో రైల్వే తూము ద్వారా ఇసుకపల్లి నుంచి ప్రధాన కాలువ నీరు వరి చేనులో ప్రవహించడంతో మునిగిపోయింది. పంటంతా నేలకొరిగిపోయింది. తీవ్రంగా నష్టపోయాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

- ఖాసిం సాహెబ్, రైతు, పాటూరు, నందలూరు మండలం.

చాపాడు :మొక్కజొన్న విత్తనాలపై కప్పిన పట్టల వద్ద నీటిని తొలగిస్తున్న మహిళ

మెడికల్ క్యాంపులు నిర్వహించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్ : ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మెడికల్ క్యాంపులు నిర్వహించి ప్రజలకు వైద్య సదుపాయాలు అందించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యకులు ముడియం.చిన్ని కోరారు. గురువారం జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజులుగా భారీ నుంచి అతి భారీ వర్షాలు జిల్లాలో కురుస్తున్నాయని పేర్కొన్నారు. దీని వల్ల గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. మరో వైపు వర్షాలు కారణంగా అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, జ్వరాలు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలలో మెడికల్ క్యాంపులు నిర్వహించి వైద్యం అందించాలని కోరారు. పిహెచ్‌సి కేంద్రాలలో నిత్యం వైద్యులు, మెడిసిన్స్ అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. వీటిపై ప్రస్తుతం తరుణంలో తనిఖీలు నిర్వహించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.కె.ఆదిల్, నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

వెంకటేష్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గోపవరం: మండలంలోని వడ్డే అగ్రహారానికి చెందిన మాజీ జడ్‌పిటిసి వేముల రమణయ్య కుమారుడు వెంకటేష్ ఇటీవల మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ గురువారం వడ్డే అగ్రహారానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వెంకటేష్ మరణానికి గల కారణాలను తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గోపవరం జడ్‌పిటిసి జయరాం రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, ఎంపిపి కొండయ్య, వైస్ ఎంపిపి రామ్మోహన్ రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు టెంకాయల నాయుడు, మల్లెకొండ చైర్మన్ మల్లెం కొండయ్య, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి-కాశినాయన : పోరుమామిళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని వెంటనే మంజూరుచేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కోరారు. గురువారం సిఐటియు ఆధ్వర్యంలో పోరుమామిళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపరిం టెండెంట్ డాక్టర్ శివ కృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ వేతనాలు ఇవ్వకపో వడంతో కార్మికుల కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపో తున్నాయని పేర్కొన్నారు. దసరా, దీపావళి పండగలు పోయినా ఇంతవరకు వేతనాలు ఇవ్వలేదని వాపోయారు. వెంటనే నాలుగు నెలలు, గతనెలలో ఒక నెల జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొంతమందికి పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా వైద్య, లేబర్, సంబ ంధిత అధికారులు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు అప్పటికీ పరిష్కారం కాకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరి ంచారు. కార్యక్రమంలో శానిటేషన్ కార్మిక వర్కర్లు బాల్ మేరి, కారు మాధవి, ధనమ్మ, సుబ్బమ్మ, విజయ కుమారి, రామసుబ్బమ్మ, వసంత, జ్యోతి, మరి యమ్మ సెక్యూరిటీ కార్మికులు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

నేడు యువజన సాంస్కృతిక పోటీలు

ప్రజాశక్తి - కడప

2025-2026 జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకొని జిల్లాస్థాయి యువజన సాంస్కృతిక పోటీలను స్థానిక రిమ్స్ రోడ్‌లోని స్పిరిట్ డిగ్రీ కళాశాలలో ఈనెల 24న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు స్టెప్ సిఇఒ జోయల్ విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఫోక్ డాన్స్ (గ్రూప్) 2, ఫోక్ సాంగ్ (గ్రూప్)3, స్టోరీ రైటింగ్, పెయింటింగ్, పోయెట్రీ, డిక్లమేషన్, సైన్స్ మేళా వంటి వివిధ పోటీలు నిర్వహించి బహుమతుల ప్రదానం చేస్తారన్నారు. ఎంపికైన అభ్యర్థులను రాష్ట్ర, జాతీయస్థాయికి పంపనున్నామని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థి సుశాంత్‌ను రక్త గాయాలు అయ్యేలా ప్లాస్టిక్ పైపుతో కొట్టిన తెలుగు ఉపాధ్యాయుడు నారాయణస్వామిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యార ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి ప్రశ్నించారు. గురువారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాబుద్ధులు నేర్పి వారిని ప్రయోజకులను చేయాల్సిన ఉపాధ్యాయులే విద్యార్థులను రక్తం వచ్చేలాగా కొట్టడం చాలా దారుణమని పేర్కొన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు నడవడికలు నేర్పే ఉపాధ్యాయులు వారి పట్ల కక్ష పూరితంగా వ్యవహరించడం దారుణమన్నారు. వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి మోహన్, జిల్లా కమిటీ సభ్యులు అభినయ్ పాల్గొన్నారు.

షర్మిలను కలిసిన విజయజ్యోతి

ప్రజాశక్తి - కడప : విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో వై.ఎస్. షర్మిలతో కడప జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం గురించి డిసిసి అధ్యక్షులు ఎన్. డి. విజయ్ జ్యోతి గురువారం చర్చించారు. సందర్భంగా షర్మిల మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరపున ప్రతి స్థానంలో పోటీ చేయించి, గెలుపొందే విధంగా పనిచేయాలని చెప్పారు. ఓట్ చోర్ కార్యక్రమం గురించి ప్రజలకు వివరించి ముందుకు సాగాలని తెలిపారు. కార్యక్రమంలో పులివెందుల నియోజకవర్గం ఇన్‌ఛార్జి ధ్రువ కుమార్ రెడ్డి , కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ సయ్యద్ గౌస్ పీర్, జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్ ఛార్జి శివ మోహన్ రెడ్డి, ప్రొద్దుటూరు ఇన్‌ఛార్జి ఇర్ఫాన్ బాషా పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం : మంత్రి

ప్రజాశక్తి - కడప అర్బన్

మంత్రిని కలిసిన ఎన్‌జిజిఒ నాయకులు

రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని రాయ చోటిలో ఎపి ఎన్‌జిజిఒ నాయకులు గురువారం మంత్రి క్యాంపు కార్యాల యంలో కలిశారు. మూడో సారి ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా కలిసి పూలబొకే అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కడప జిల్లా నూతన కార్యవర్గనికి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులకు డిఎ ఇవ్వడం ద్వారా సంతోషంగా ఉన్నారని చెప్పారు. అన్ని డిమాండ్లు సిఎం చంద్రబాబు పరిష్కరిస్తారని పేర్కొన్నారు. ఉద్యోగులకు అండగా ఉంటానన్నారు. ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షులు బి. శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు అపర్తి విద్యా సాగర్, ప్రధాన కార్యదర్శి డి.వి. రమణ రాయచోటికి శుక్రవారం వస్తున్నారని మంత్రికి వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి నిత్యపూజయ్య, జిల్లా కోశాధికారి టి. శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శి పద్మనాబారావు పాల్గొన్నారు.

ఆధార్ వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : మండల పరిధిలోని 31 పాఠశాలల్లో ఈనెల 23వ తేదీ నుంచి 3 వరకు నిర్వహిస్తున్న ఆధార్ సర్వీస్‌ను సద్వినియోగం చేసుకోవాలని కడప మండల ఎంఇఒలు రఫిక్ అహ్మద్, ఇషాద్ అహ్మద్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. కడప మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేటు అన్ని యాజమాన్య ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాల పరిధిలోని విద్యార్థులకు ఆధార్ నమోదులో తప్పులు ఉన్నట్లయితే, అలాగే కొత్త ఆధార్ కార్డు కోసం ఆధార్ వారోత్సవాలను, స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారని తెలిపారు

ప్రజా పోరాటాలకు సన్నద్ధం కావాలి

- సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్

మాట్లాడుతున్న సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్

ప్రజాశక్తి- కడప అర్బన్

జిల్లాలో అనేక సమస్యలు తిష్టవేశాయని, ముఖ్యంగా నగరంలో వర్షాకాలం వచ్చిందంటే ప్రజల్లో భయాందోళనలు ప్రారంభమవుతాయని, వాటిని పరిష్కరించడంలో పాలకులు, అధికారులు పూర్తిగా విఫలమయ్యారని, పరిష్కారం కోసం రానున్న కాలంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించేందుకు నాయకులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అందుకు అవసరమైన శిక్షణ తరగతులను ఈ నెల 25, 26న యుటిఎఫ్ భవన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరంలో ఇటీవల కురిసిన వర్షానికి శివారు ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కాలువలు, చెరువులు, కుంటలు, ఆక్రమణలకు గురయ్యాయని, హైడ్రా తరహాలో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి వాటిని కూల్చివేయాలని డిమాండ్ చేశారు. వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక ఇళ్లల్లోకి చేరుతున్నాయని వాపోయారు. జిల్లాలో ఆసుపత్రి యాజ మాన్యాలు ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించకపోవడం వల్ల సేవలను నిలిపి వేశాయని చెప్పారు. దీని కారణంగా పేదలకు సంబంధించిన వైద్యం సకాలంలో అందించేందుకు ఆటంకం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందన్నారు . పెండింగ్‌లో ఉన్న బకాయిలన్నీ తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. పులివెందుల మెడికల్ కళాశాల నూతనంగా నిర్మాణం చేపట్టినా దాన్ని ప్రభుత్వ రంగంలో నిర్వహించడానికి ప్రయత్నం చేయకపోవడం సరైంది కాదన్నారు. పిపిపి విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వ రంగంలోనే మెడికల్ కళాశాలను నిర్వహించేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. కడప జిల్లాలో ఆరోగ్య రంగాన్ని మెరుగుపరిచేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీ సమ్మె ఒకవైపు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల ఆందోళన ఇంకో వైపు కొనసాగడం వల్ల వైద్యం సక్రమంగా అందే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి4 సర్వే, మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ, భూకబ్జాలు, లక్షల కోట్లు పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయని ప్రజలను మభ్యపెట్టడం వంటి ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతుందని పేర్కొన్నారు. కడప నగరంలో అనేక సమస్యలు ముందుకు వస్తున్నాయని, కార్పొరేషన్ అధికారులు, పాలకవర్గం మౌలిక వసతులు విస్మరించిందన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, నగర కమిటి సభ్యుడు చంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఎలాంటి నష్టం వాటిల్లరాదు

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్

తుపాన్ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని అన్ని శాఖల అధికారులను ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్ ఆదేశించారు. జిల్లాలో పరిస్థితులపై ఆమె జిల్లా స్థాయి, క్షేత్ర స్థాయి అధికారులతో గురువారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎటువంటి ప్రాణ, ఆస్తి, పంట నష్టం చోటు చేసుకోకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలాల వారీగా చెరువు కట్టలు, కాలువ గట్టుల పరిరక్షణపై దృష్టి పెట్టాలని, వాగులు, వంకలు, కుంటల వద్ద అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులు మొదలు నియోజకవర్గ, మండల, సచివాలయ, గ్రామ స్థాయి వరకు ప్రతి అధికారి, సిబ్బంది వారి వారి ప్రధాన కార్య స్థానాలలో అందు బాటులో ఉండాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన పంటల సాగు చేసే రైతులను అప్రమత్తం చేయాలని పంట నష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై రైతులను అప్రమత్తం చేయాలని వ్యవసాయ ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. ఎక్కడా పాడి సంరక్షణకు, పశు నష్టం జరగకుండా పశు సంవర్ధక సహాయకులు బాధ్యత వహించాలని పశుసంవర్ధక శాఖ అధికారిని ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు వర్షాల కారణంగా విద్యుత్ అంత రాయం అయితే వెంటనే దానిని పునరుద్ధరించేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. విపత్తు సమయంలో ప్రతి ఒక్క అధికారి, సిబ్బంది మరింత బాధ్యతతో వారి విధులను నిర్వర్తిం చాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి జిల్లాలోని అన్ని ఏరియా ఆసుపత్రులు, పిహెచ్ సిలలో సకాలంలో డాక్టర్లు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అందుబాటులో ఉండాలని, అవసరమైన మందులను అందు బాటులో ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖా అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అత్యవసర సహాయ సమాచార నిమిత్తం 08562 - 246344 కంట్రోల్ రూమ్‌ను కూడా ఏర్పాటు చేశామని చెప్పారు.

శిక్షణలో ఆదర్శంగా నిలవాలి : డిఇఒ

ప్రజాశక్తి - కడప అర్బన్

స్కౌట్ శిక్షణలో ఆదర్శంగా నిలవాలని డిఇఒ షంషుద్దీన్ పేర్కొన్నారు. మేలో నిర్వహించిన హిమాలయ వుడ్ బ్యాడ్జి ఫర్ స్కౌట్ మాస్టర్ కోర్సులో జిల్లా నుంచి స్కౌట్ మాస్టర్లు ఖాదర్ బాష, బాల సుందరం, వెంకట సుబ్బయ్య పాల్గొని ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్ర కార్యదర్శి నరసింహారావు వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా చీఫ్ కమిషనర్, సెక్రటరీ, జిల్లా విద్యా శాఖ అధికారి డాక్టర్ షంషుద్దిన్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరెన్నో లీడర్ శిక్షణ కోర్సులలో పాల్గొని జిల్లాలో మరెన్నో కొత్త యూనిట్లను ప్రారంభించాలని ఆకాంక్షించారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్



వినతి పత్రం అందజేస్తున్న మేకల శివార్జున

జిల్లాలో బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని బహుజన టీచర్స్ యూనియన్ (బిటియు) రాష్ట్ర అధ్యక్షులు మేకల శివార్జున కోరారు. గురువారం డిఇఒ షంషు ద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా శివార్జున మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు బదిలీ అయ్యి నాలుగు నెలలు అవుతోందని తెలిపారు. రిలీవర్లు లేని కారణంగా ఉమ్మడి జిల్లాలో దాదాపు 180 మంది ఉపాధ్యాయులు బదిలీ అయిన పాఠశాలకు వెళ్లకుండా పాత పాఠశాలలలోనే ఉన్నారన్నారు. సుదూర ప్రాంతాలలో ఉన్నవారు, భార్య, భర్త ఉద్యోగులైన వారు, అనారోగ్య సమస్య ఉన్నవారు, ఇలా రకరకాలుగా ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులు ఉన్నారని పేర్కొన్నారు. ఇది చాలా బాధాకరమని, బదిలీ అయిన ఉపాధ్యాయులందరినీ రిలీవ్ అయ్యేలా చూడాలని కోరారు. అదేవిధంగా క్లస్టర్ ఉపాధ్యాయుల సమస్యలు కూడా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన డిఇఒ పది రోజులలోగా విద్యా వాలంటీర్లను నియమించి రిలీవ్ అయిన ఉపాధ్యాయులందరినీ బదిలీ అయిన ప్రాంతానికి పంపిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింత గింజల సుదర్శన్ బాబు, జిల్లా అధ్యక్షులు మేంద్రగుత్తి గంగరాజు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె: రైతులకు మరిన్ని మెరుగైన సేవలు అందించాలని, అందు కోసం విస్తరణ సేవలు విస్తృతం చేయాలని ఆచార్య యన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ జి. శివనారాయణ పేర్కొన్నారు. గురువారం ఆయన కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం కెవికె సాంకేతిక కార్యక్రమాలపై సమీక్షించి వాటి పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుతున్న రైతు అవసరాలకు అనుగుణంగా కేవలం వ్యవసాయ పంటలే కాక ఉద్యాన ,పాడి, కోళ్ళు, గొర్రెలు, మేకల పెంపకంపై దృష్టి సారించేలా అవగాహన కల్పించాలన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం లబ్ధిదారులతో ఆయన మాట్లాడి కొన్ని సలహాలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో కె. అంకయ్య కుమార్, ఎఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి ప్రభాకర్ రెడ్డి, ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ యన్. క్రిష్ణ ప్రియ, కెవికె శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఐడిలు కేటాయించాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

మెగా డిఎస్‌సి ద్వారా జిల్లాలో ఎంపికైన ఉపాధ్యాయులకు వెంటనే ట్రెజరీ ఐడీలు కేటాయించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. గురువారం జిల్లా ఖజానా కార్యాలయంలో ఉపసంచాలకులు ఎం.ఎస్.వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం మెగా డిఎస్‌సి ద్వారా నూతనంగా ఉమ్మడి కడప జిల్లాలో 672 మంది ఉపాధ్యాయులను నియమించిందని పేర్కొన్నారు. వారికి ట్రెజరీ ఐడిలు కేటాయించడంలో ఆలస్యం కావడం వల్ల జీతాలు పొందలేకపోతున్నారని తెలిపారు. ఖజానా కార్యాలయం నుంచి వేగవంతంగా ట్రెజరీ ఐడిలను కేటాయించాలని కోరారు. ఉప ఖజానా శాఖ అధికారి వెంకటేశ్వర్లు స్పందిస్తూ డిఇఒ కార్యాలయం నుంచి ఎంపికైన ఉపాధ్యాయుల జాబితా ఇంకా రాలేదని, వచ్చిన వెంటనే సబ్ ట్రెజ రీలకు సమాచారం అందజేసి వేగవంతంగా ఐడి కేటాయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి. రమణ, ఏజాస్ అహ్మద్, నాయకులు గోపీనాథ్, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు ప్రభుత్వం ఆదుకుంటుంది

ప్రజాశక్తి-కాశినాయన

ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయి ఇ-క్రాప్ చేయించుకున్న రైతులు అధైర్య పడవద్దని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, వాటి ద్వారా రైతుల ధాన్యాన్ని ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తుందని చెప్పారు. గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో కూడా పలు ధాన్యాలను కొనుగోలు చేస్తుందన్నారు. ఇ-క్రాప్ చేసుకున్న ప్రతి రైతుకూ ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. మద్దతు ధరలకు పంటలు అమ్ముకోవాలంటే తప్పనిసరిగా ఇ-క్రాప్ చేసుకోవాలని సూచించారు. ధాన్యం నిల్వ ఉంచేందుకు నియోజవర్గంలో గోడౌన్స్ కూడా ఏర్పాటు చేశామన్నారు.. ప్రతి రైతూ దాన్యం అమ్ముకోవాలంటే వారికి సంబంధించిన రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని చెప్పారు. రైతుల అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇకపై రైతన్న పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించదన్న బెంగలేదన్నారు.2025-26 ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే వ్యవసాయ ఉత్పత్తులకు ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటన చేసిందన్నారు.

28న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు

ప్రజాశక్తి - కడప

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

మెడికల్ కళాశాలల ప్రయి వేటీకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 18న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించనున్నట్లు వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, రాజంపేట పార్లమెంట్ పరిశీలకులు సురేష్ బాబు, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ అన్నారు. గురువారం వైసిపి జిల్లా కార్యాలయంలో ర్యాలీలకు సంబం ధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సిఎం వై.ఎస్. జగన్ నిర్మించిన మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై వెనక్కి తగ్గేదాకా వైసిపి పోరాడుతుందని పేర్కొన్నారు. కలిసి వచ్చే రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులతో కలిసి ఉద్యమిస్తామని అన్నారు. కోటి సంతకాల సేకరణతోపాటు అవగాహన ర్యాలీలు నిర్వహించనున్ననట్టు వివరించారు. నవంబర్ 24 నాటికి సంతకాల సేకరణ పూర్తవుతుందని, ఆ సంతకాల ప్రతులను మాజీ సిఎం జగన్ పార్టీ నాయకులతో కలిసి వెళ్లి రాష్ట్ర గవర్నర్‌కి అందజేస్తారని తెలిపారు.

సోమశిల ముంపు గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

ప్రజాశక్తి- ఒంటిమిట్ట

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలంలోని సోమశిల ముంపు గ్రామాలైన పెన్న పేరూరు, వెంకటాయపల్లి, ఇబ్రహీంపేట, గంగ పేరూరు, నరసన్న గారి పల్లి, పెన్నా నది పరిసర ప్రాంతాలైన గొల్లపల్లి ,దర్జీపల్లి గ్రామాలకు చెందిన వారు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ప్రణయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాగులు, వంకలు, లోతట్టు ప్రాంతాల జిల్లాలో భారీ ప్రవాహాలు వచ్చే ప్రమాదముందని, ప్రజలు నదులు, వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని, సెల్ఫీలు లేదా వేరే అవసరాల కోసం వాటి వద్దకు వెళ్లడం ప్రాణాంతకమని హెచ్చరించారు. పాత ఇళ్లలో నివసిస్తున్న వారు ఆలస్యం చేయకుండా, సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు. అత్యవసరం అయితే తప్ప, వర్షం ఉధృతంగా ఉన్నప్పుడు ప్రయాణాలు చేయవద్దని, సురక్షితంగా ఇళ్లలోనే ఉండాలని కోరారు. ఏదైనా ఆపద తలెత్తితే లేదా ఎక్కడైనా ప్రమాదం చూసినా, తమ పోలీస్ బృందాలు మీకు అండగా ఉంటాయని, వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ కు లేదా డయల్ 100/112కు కాల్ చేయలన్నారు. ప్రజలు నిబంధనలు పాటిస్తూ, పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - కడప

నగరంలోని ఇంటర్, డిగ్రీ, బిటెక్ కళాశాలలో మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా గురువారం కడప జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు పసుపులేటి సాయిదత్త ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సంతకాలు చేశారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం నాయకులు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సందీప్, జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్యామ్, రుద్రసేనారెడ్డి, కడప నగర ఉపాధ్యక్షులు జబ్బార్, ప్రధాన కార్యదర్శిలు విష్ణు, హేమంత్, విద్యార్థి విభాగం నాయకులు పాల్గొన్నారు.

పంటను కాపాడుకునేందుకు ఎన్ని తిప్పలో..!

చాపాడు: ఉల్లిపంట తడవకుండా పట్టలు కప్పిన రైతులు

ప్రజాశక్తి - చాపాడు

తుఫాన్ తాకిడికి రైతులు విలవిలలాడిపోతున్నారు. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వర్షం కాస్త తెరపనివ్వడంతో తడిచిన మొక్కజొన్న, వరి, ఉల్లిగడ్డలను రైతులు ఆరబెట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం 1 గంట సమయంలో ఒక్కసారిగా భారీ వర్షం పడింది. రైతులు అంత పెద్ద వర్షంలో కూడా ధాన్యాన్ని కాపాడుకునేందుకు నానా అవస్థలు పడ్డారు. ఇంటిళ్లపాది రోడ్లపైన కుప్పలుగా పోసుకున్న ఉల్లిగడ్డలను, మొక్కజొన్న విత్తనాలను, వరి ధాన్యాన్ని ప్లాస్టిక్ పట్టలతో కప్పుకుంటూ తిప్పలుపడ్డారు. కొంతమంది మహిళలు ఇంటిలో కసువు ఊడ్చే విధంగా వర్షానికి పడిన నీటిని పరకలతో ఊడ్చారు. రైతుల కష్టాలను చూస్తే మనసు తరుక్కుపోతంది. ఆరుగాలం కష్టించి పండించిన పంటలు వర్షం పాలవుతుంటే రైతు కంట్లో నెత్తుటి చుక్కలు కనిపిస్తున్నాయి. ఏ ఒక్క రైతును కదిలించినా నోటి నుంచి మాటలు రావడం లేదు. ధరలు అంతంత మాత్రమే ఉన్నప్పటికీ వాటిని ఏదో ఒక విధంగా కాపాడుకొని వచ్చిన కాడికి అమ్మకాలు చేపట్టి నష్టాలను కాస్తయినా తగ్గించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. రైతులు ఇంత ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు అందడం లేదు. పండించిన పంటలను ఆరబెట్టుకునే వసతి ఎక్కడ కూడా అందుబాటులో లేదు. మైదుకూరు నియోజకవర్గం వ్యాప్తంగా లక్ష ఎకరాల వరకు వ్యవసాయ పొలాలు ఉన్నప్పటికీ ఒక ఎకరంలో కూడా ధాన్యాన్ని ఆరబెట్టుకునే వసతి లేదు. ఈ పరిస్థితుల్లో రోడ్లు, ఖాళీ ప్రదేశాలు, పెట్రోల్ పంపులు, రైస్ మిల్లులను రైతులు ఆసరా చేసుకుని ధాన్యాన్ని కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కడప-కర్నూలు ప్రధాన రహదారి వెంబడి మొక్కజొన్న విత్తనాలను ప్లాస్టిక్ పట్టలను కప్పుకొని వాటిపై నీరు చేరకుండా రైతులు చూసుకుంటున్నారు. మైదుకూరు నుంచి వనిపెంట వరకూ ఎక్కడ ఖాళీ ప్రదేశం ఉన్నా అక్కడ ఉల్లిగడ్డలను కుప్పలుగా పోసి ప్లాస్టిక్ పట్టలను ఏర్పాటు చేసి ఉంచారు. మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు మండలాలలో 50 వేల ఎకరాల్లో వరి పంట ప్రస్తుతం సాగులో ఉంది. 7 వేల ఎకరాల వరకు నూర్పిడికి సిద్ధంగా ఉంది. గతవారం రోజులగా నియోజకవర్గ వ్యాప్తంగా పదివేల ఎకరాల వరకు మొక్కజొన్న, జొన్న, సొద్ద, మినుము, వేరుశనగ పంటలు సాగు చేసిన రైతులు మళ్లీ సాగు చేసు కోవాల్సిందేనని ఆశలు వదులుకున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వర్షానికి ఇబ్బందులు పడుతున్న తమను ఆర్థికంగా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

సోమిరెడ్డిపల్లె పొలాల్లో నీట మునిగిన వరి పంట..

బ్రహ్మంగారిమఠం : సోమిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఊటుకూరు సిద్ధారెడ్డి అనే రైతు వరి పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలకు నీటి పాలయ్యింది. ఐదు ఎకరాల వరి పంట చేతికి అందే సమయంలో నీట మునిగి పోవడంతో రైతు లబోదిబో అంటున్నాడు. ప్రభుత్వం స్పందించి పంట నష్ట పరిహారం అందివ్వాలని రైతు కోరుతున్నాడు. పంటలు నీట మునిగినా అధికారులు ఇంత వరకు అటువైపు చూడని పరిస్థితి. తమకు నష్టం వాటిల్లుతున్నా అధికారులు మండలంలో ఉన్నారా లేరా అనే విషయం కూడా అర్థం కాని పరిస్థితిలో ఉన్నామని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వర్షాలకు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

జడివానతో నెలకూలిన వరి పంట

వేంపల్లె : కురుస్తున్న జడివానతో రైతులు సాగు చేసిన వరి పంట నెలకూలింది. పాపాగ్ని నది పరివాహక ప్రాంతాలు వేంపల్లె, చక్రాయపేట మండలాల్లో భారీ ఎత్తున వరి సాగు చేశారు. మూడు రోజులు నుండి కురుస్తున్న వర్షాలకు చేతికి వచ్చిన వరి పంట నేలకూలడంతో ఆయా గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. వరికోత కోసే సమయంలో వర్షాలు కురుస్తుడడంతో వరి కోత కోసేందుకు వీలులేకుండా పోయింది. నష్టపోయామని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎడతెరిపిలేని వర్షంతో పొలాల్లో నీరు చేరి పంటలు దెబ్బతింటున్నాయని వాపోతున్నారు. వరి పంటను సాగు చేసేందుకు ఏకరాకు రూ.30 వేలు ఖర్చు చేశామని రైతు కరీముల్లా వాపోయాడు. దిగుబడులు బాగా వచ్చినప్పటికీ వర్షాలతో పంటలు దెబ్బతిన్నడంతో అప్పులపాలయ్యామని ఆవేదన చెందుతున్నారు. దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

వేంపల్లె : వర్షానికి నేలకొరిగిన వరి పంట

ఎఓకు వినతిపత్రం ఇస్తున్న నాగేళ్ల సాంబశివరెడ్డి, రైతులు

రాయితీ శనగ విత్తనాలు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - వేముల

రాయితీ శనగ విత్తనాలు పంపిణీ చేసి రైతులను ఆదుకోవాలని వైసిపి మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు గురువారం ఆయన వేముల వ్యవసాయ కార్యాలయంలో ఎఒ ఓబులేస్‌కు రైతులతో కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్ ప్రారంభమై నెల రోజులవుతున్నా ప్రభుత్వం రైతులకు రాయితీ శనగ విత్తనాలను పంపిణీ చేయలేదన్నారు. ఈ సీజన్‌లో రైతులు శనగ పంటను విస్తారంగా సాగు చేస్తారని తెలిపారు. అదును దాటుతున్నా ప్రభుత్వం శనగ విత్తనాలను పంపిణీ చేయలేదని వివరించారు. ఇప్పటికే రైతులు బయట మార్కెట్లో శనగ విత్తనాలను కొనుగోలు చేసి తెచ్చుకున్నారన్నారు. కార్యక్రమంలో వైసిపి ఉపాధ్యక్షులు బొజ్జ శివశంకర్‌రెడ్డి, నారుబోయిన గంగాధర్, యర్రగొర్ల చలపతి, చల్ల వెంకట నారాయణ, కో-ఆప్షన్ మెంబర్ మండి మాఫీరా, మాజీ ఎంపీటీసీలు రాధాకృష్ణ, చందా మల్‌రెడ్డి, మాజీ డిసిసి చైర్మన్ ఆంజనేయులు, గంగయ్య, గౌస్ పీర్, వికలాంగుల అధ్యక్షులు చాగలేటి భాస్కర్, వైస్ ప్రెసిడెంట్ జెర్మియా, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న వైసిపి నాయకులు

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

భారీ వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వైసిపి జిల్లా జనరల్ సెక్రెటరీ రాఘవరెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, మైదుకూరు నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు నాగిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కొమ్మలూరు ప్రాంతంలో వర్షాలకు నేల కొరిగిన వరి పంటను గురువారం వారు రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తుపాను ప్రభావం వల్ల ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు వరి పంటకు పూర్తిగా దెబ్బతిందన్నారు. పంట చేతికొచ్చే సమయానికి ప్రకృతి వైపరీత్యంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం వెంటనే పరిహారం అందించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వైసిపి నాయకులు అంబటి శివారెడ్డి, సర్పంచ్ ఆదినారాయణరెడ్డి, త్రిపు రవరం మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, కూనవారిపల్లె చిన్న సుబ్బారెడ్డి, వినోద్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనులు త్వరగా చేపట్టాలి

వేంపల్లె : కడప-రాజంపేట-కోడూరు-రేణిగుంట జాతీయ రహదారి విస్తరణ పనులను త్వరగా ప్రారంభించాలని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూడేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం కడప, రాజంపేట, కోడూరు, రేణిగుంట జాతీయ రహదారి విస్తరణ పనులకు 122 కిలోమీటర్ల పొడవుతో, నాలుగు వరుసల రోడ్డుగా రూ.3,232 కోట్లు మంజూరు చేసిందన్నారు. 2023 అక్టోబర్ మాసంలో టెండర్లు వేయగా లక్ష్మీ ఇన్ఫ్రా సంస్థ టెండర్ దక్కించుకుందన్నారు. కడప నుంచి చిన్న ఓరంపాడు వరకు 64 కిలోమీటర్ల మొదటి ప్యాకేజీగా, చిన్న ఓరంపాడు నుంచి రేణిగుంట వరకు 58 కిలోమీటర్ల రెండవ ప్యాకేజీగా టెండర్లు పిలువగా రెండు టెండర్లను కూడా లక్ష్మీ ఇన్ఫ్రా సంస్థ దక్కించుకున్నట్లు తెలిపారు. టెండర్లు పూర్తయి రెండేళ్లు దాటిన ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదన్నారు. చెన్నయ్, ముంబై మహా నగరాలను కలుపుతూ ఈ నేషనల్ హైవే సాగుతుందన్నారు. నిరం తరం రద్దీగా ఉంటుం ద న్నారు. కడప-తిరుపతి రహదారిలో తరచూ జరిగే ప్రమాదాల నివారణకు రోడ్డు విస్తరణ చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి చర్యలు తీసు కోవాలని సూచించారు.

గౌరవనీయులైన జమ్మలమడుగు
జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

O.S.No. 357/2022

Ankireddy@ Tathireddy Malleswaramma, aged about 70 years, D/o Late Venkata Konda Reddy, W/o Venu Gopal Reddy, Hindu, Agriculture, D.No.2/57, Chinnapolamada Village, Tadipatri Mandal, Anantapur Dist.
...Plaintiff

Vs

Ankireddy @ Malkireddy Prabhavathamma, aged about 66 years, D/o Late Venkata Konda Reddy, W/o Rama Sekhar Reddy, Hindu, agriculture, R/o Bharath Apartment, YMR Colony, Proddatur Town and Mandal, YSR Kadapa Dist.
...Defendant No.2

నోటీసు

ఈ నెంబరు దావాలోని వాది, ప్రతివాది నెంబరు: 2 అయిన మీ పైన మరియు మరికొందరు (అంకిరెడ్డి వెంకట కొండారెడ్డి వారసులు) తనకు రావలసిన ఆస్తిని భాగపరిష్కారం కోరుతూ మీ అందరిపైన దాఖలు చేసిన దావా మీ హాజరు కొరకు పై కోర్టులో 30.10.2025న వాయిదా వున్నది. అట్టి దావాలో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల ఆ తేదీన పై కోర్టులో ఉదయం 10.30 గంటలకు హాజరై తెలుసుకొనవచ్చును. లేనంతట మీకు పరోక్షముగా తీర్మానించబడును.

షెడ్యూలు నెంబరు-1
వైఎస్ఆర్ కడప జిల్లా, ముద్దనూరు సబ్-డిస్టిక్, కొండాపురం మండలం, బురుజుపల్లె గ్రామ పొలంలోని సర్వే నెంబరు: 141/1, 146/2, 147/1 లోని 03.04 సెంట్లు.

షెడ్యూలు నెంబరు-2
వైఎస్ఆర్ కడప జిల్లా, ముద్దనూరు సబ్-డిస్టిక్, కొండాపురం మండలం, బురుజుపల్లె గ్రామ పొలంలోని సర్వే నెంబర్లు 147/1, 147/2, 147/4లో విస్తీర్ణం ఎసి.03.52 సెంట్లు.
తూర్పు: అంకిరెడ్డి కుమ్మర నందరెడ్డి భూమి, పడమర: అంకిరెడ్డి నారపురెడ్డి భూమి, ఉత్తరం: అంకిరెడ్డి నాగార్జునరెడ్డి, భూమి, దక్షిణం: ఆదిరెడ్డి వెంకట రామిరెడ్డి భూమి.

షెడ్యూల్ నెంబరు:3
వైఎస్ఆర్ కడప జిల్లా, ముద్దనూరు సబ్-డిస్టిక్ట్, కొండాపురం, బురుజుపల్లె గ్రామ పొలంలోని సర్వే నెంబరు-170లో విస్తీర్ణం ఎసి 02.27 సెంట్లు.
తూర్పు: ఎ.నాగిరెడ్డి భూమి, పడమర: రోడ్డు, ఉత్తరం: ఎ.మదుసూధన రెడ్డి, భూమి, దక్షిణం: కల్లం.

షెడ్యూల్ నెంబరు:4
వైఎస్ఆర్ కడప జిల్లా, ముద్దనూరు సబ్-డిస్టిక్, కొండాపురం మండలం, బురుజుపల్లె గ్రామ పొలంలోని సర్వే నెంబర్లు 155 మరియు 154లో విస్తీర్ణం ఎసి.06.13 సెంట్లు, తూర్పు: కుమరనాథరెడ్డి భూమి, పడమర: ఎ.నాగార్జున రెడ్డి భూమి, ఉత్తరం: ఎ.నాగార్జున రెడ్డి భూమి, దక్షిణం: కల్లం.

షెడ్యూల్ నెంబరు:5
వైఎస్ఆర్ కడప జిల్లా, ముద్దనూరు సబ్-డిస్టిక్, కొండాపురం మండలం, బురుజుపల్లె గ్రామ పొలంలోని సర్వేనెంబరు 154లో విస్తీర్ణం ఎసి 02.50 సెంట్లు.
తూర్పు: అంకిరెడ్డి కొండారెడ్డి భూమి, పడమర: రోడ్డు, పడమర: రోడ్డు, ఉత్తరం: ఎమ్.వేదవతి భూమి, దక్షిణం: వల్లెపు ఈశ్వర రెడ్డి భూమి.

షెడ్యూల్ నెంబరు :6
వైఎస్ఆర్ కడప జిల్లా, ముద్దనూరు సబ్-డిస్టిక్, కొండాపురం మండలం, బురుజుపల్లె గ్రామ పొలంలోని సర్వే నెంబరు 136/1లో విస్తీర్ణం ఎసి.01.50 సెంట్లు.
తూర్పు: చిన్న నాగపు భూమి, పడమర: ఒంటిద్దు నరసింహారెడ్డి భూమి, ఉత్తరం: బురుజుపల్లె-కొనవారిపల్లె రస్తా, దక్షిణం: అంకిరెడ్డి రంగారెడ్డి భూమి.

//బైది ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//

పాలాజి రవికుమార్
వాది తరపు అడ్వకేట్, జమ్మలమడుగు.

IN THE COURT OF THE PRL.JR.CIVIL JUDGE : KURNOOL
O.S.NO.1341/2024

Smt. R.Vimala. ...Plaintiff

-Vs-

D.Ramasubbareddy S/o D.Sanjeev Reddy Business, R/o H.No.3-/399 E, Y.M.R.Colony, Prdutur Town, Kadapa (Dt.). ...Defendant

ప్రతివాదికి దావా సమన్లు

పై నెంబర్ దావాలో వాది, ప్రతివాదిపైన Redeem the plaint schedule property by recovering the plaint schedule property in favour of the plaintiff by (expaired) the (martegage deed) dt.16-11-2022 మరియు కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఆక్షేపణ ఉన్న 10-11-2025 తేదిన పగలు 10.30 గం॥లకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలయును. లేని యెడల నీ పరోక్షమున విచారించి తీర్మానింపబడను.

PLAINT SCHEDULE PROPERTY

As per plan the plots are made over the land bearing Sy No 65/2A & 65/2C of Mamidalapadu Village, under the limits of Stantanpuram Panchayathi Area, Kurnool Mandal, Kurnool District within the Sub-Registration District of Kurnool and Registration District of Kurnool out of the said plots, Plot No. 14 has been purchased by the plaintiff from one D. Srinivasulu through sale deed dated:26-08-2008 and the same has been registered in her favour at Book No.1, vide document No 7638 of 2008 at Kurnool Registrar Office, onwards the property is in her possession and enjoyment of the same and its constructed place measurements.

The land admeasuring 25 feet or 7.62 Sq.meters towards East-West and admeasuring 75 feet or 22.86 Sq.meters towards North-South totally the land admeasuring 1875 Sq. Feet or 208.33 Sq. Yards of land is bounded as follows:
East : Land belongs to others.
West : Place of Plot No. 13
North : Part of land in the same survey number belongs to D. Srinivasulu
South : 30' feet width Road.

In between the land admeasuring 208.33 Sq. Yards of land issued by the Stantanpuram Gram Panchayath authority vide D.Dis. No. 101/5/2008-2009, dated:09-02-2009 and its to be constructed building as per plan and its 208.33 Sq. Yards of open place and its to be constructed ground floor (as per Physical Possession) at 1/3rd place i e 1500 Sq.feet of building is bounded as follows:
East : 3½ feet width balcony.
West : Open place of the building
North : Open place of the building.
South : Open place of the building.

And its steps the place between the boundaries of ground floor only. The said entire property market value is Rs. 10,50,000/- only.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
సయ్యద్ M.D. మీర్‌షాఖాద్రీ,
M. గోపాల్ శెట్టి,
వాదిపరం అడ్వకేట్లు,
కర్నూలు.

మాట్లాడుతున్న డాక్టర్ హిమబిందు

వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని డాక్టర్ హిమబిందు సూచించారు. స్థానిక ఎబిఎన్ స్కూల్ ఆవరణం, ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ బహిష్టు సమయంలో పరిశుభ్రత, పోషకాహారం గురించి అవగాహన కల్పించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ వర్షాకాలం నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు పెరిగే అవకాశం ఉందన్నారు. దోమతెరలు వాడాలన్నారు. నీటిని కాచి, చల్లార్చుకుని తాగాలని సూచించారు. మలేరియా, డెంగీ జ్వరం, మెదడువాపు, చికెన్‌గన్యా రాకుండా చూసుకోవాలన్నారు. అనంతరం 102 మంది బాలికలకు ఎత్తు, బరువు, హిమోగ్లోబిన్ రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శోభారాణి, కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎంవి సుబ్బారెడ్డి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ సత్యవతి, పద్మావతి, ఎఎన్ఎంలు, ఆశాలు, బాలికలు పాల్గొన్నారు.

మెడికల్ అఫీసర్‌తో మాట్లాడుతున్న డాక్టర్ హరీష్

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రోగులకు మెరుగైన వైద్యం అందించాలని పులివెందుల నియోజకవర్గం జనసేన సమన్వయ కర్త డాక్టర్ హరీష్ కోరారు. వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం జనసేన నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు రోగులకు అందుబాటులో ఉన్న వైద్యం గురించి చీఫ్ మెడికల్ అఫీసర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హరీష్ మాట్లాడుతూ అపరేషన్ థియేటర్‌కు విద్యుత్ సరఫరా లేకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు. రేడియో గ్రాఫర్ లేక ఎక్స్ రే మిషన్‌కు సీల్ తీయలేదని వైద్యులు తెలిపారు. ఆర్థో వైద్యుడు ఉన్నప్పటికీ ఉపయోగం లేకుండా పోయిందని నాయకులకు వివరించారు. రేడియో గ్రాఫర్ ను నియమిస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ఆసుపత్రిలో ఉన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగభూషణంరెడ్డి, కూటమి నేతలు శ్యాం, దేవా, ఇడుపులపాయ జయచంద్ర, లక్ష్మణ్, దొంతు సుమన్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మల్లికార్జున పాల్గొన్నారు.

గ్రామసభలో మాట్లాడుతున్న సిఐ రమణ

ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - లింగాల

పాత కక్షలు పెంచుకుని అల్లర్లు సృష్టించవద్దని, గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పులివెందుల రూరల్ సిఐ ఎన్‌వి రమణ హెచ్చరించారు. గ్రామంలో అందరూ ఫ్యాక్షన్ కి దూరంగా ఉండాలని గురువారం ఆయన గుణకణపల్లెలో గ్రామసభ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రౌడీ షీటర్లు ఈ రోజు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో తెలుసుకోవాలన్నారు పిల్లలన్ని విద్యావంతులు చేసి భావిపౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌టియు మైదుకూరు నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

ఎస్‌టియు మైదుకూరు మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షులుగా గోవిందిన్నె కిరణ్‌కుమార్(పెద్ద శెట్టిపల్లె), ప్రధాన కార్యదర్శిగా ఈనెపాటి ఈశ్వరయ్య(గంజికుంట), ఆర్థికశాఖ కార్యదర్శిగా విజయ నరసింహారాజు(సాయినాధపురం)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ఉపాధ్యాయులు అందరికీ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసులు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు ఆర్టీసీ డిపో నుండి కార్తీకమాసం సందర్భంగా అరుణాచలానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ శ్రీలత తెలిపారు. అక్టోబర్ 26, నవంబర్ 2,9,16 తేదీల్లో సాయంత్రం 5 గంటలకు మైదుకూరు నుంచి బస్సు బయలుదేరుతుందన్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా నవంబర్ 4న సాయంత్రం 3 గంటలకు బస్సు బయలుదేరుతుందన్నారు. సూపర్ లగ్జరీ బస్సుకు రానుపోను రూ.1,180 టికెట్ ధర నిర్ణయించామన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎరువుల విక్రయాలను పరిశీలిస్తున్న ఎఒ దేవి పద్మలత

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - చాపాడు

యూరియా ఇతర కాంప్లెక్స్ ఎరువులను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి దేవి పద్మలత హెచ్చరించారు. గురువారం ప్రయివేట్ దుకాణాల వద్ద యూరియా పంపిణీని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. అధిక ధరలకు దుకాణ యజమానులు అమ్మకాలు చేపడితే వెంటనే తమ దృష్టికి తేవాలన్నారు. ఎరువులను పంపిణీ చేసే సమయంలో కచ్చితంగా రైతులకు రసీదు ఇవ్వాలన్నారు. రైతులకు ఎరువులను పంపిణీ చేసే సమయంలో బయోమెట్రిక్ ఆధారంగానే నమోదు చేసుకొని ఇవ్వాలన్నారు. నిబంధనలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. యూరియాను అవసరం మేరకు వాడాలని ఆమె రైతులకు సూచించారు.

పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

స్వచ్ఛభారత్‌లో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

శ్రీవీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఆధ్వర్యంలో కరస్పాండెంట్ డాక్టర్ డిఎల్ రవీంద్రారెడ్డి, ఎండి ఎస్కే వల్లి నిర్వహణలో ఎన్ఎస్ఎస్ అధికారులు రామకృష్ణ, ఆచార్య ఎన్.వెంకట్రాంరెడ్డి, డాక్టర్ రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రిన్సిపల్ ముండ్లపాటి చంద్రశేఖర్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ గురు స్వప్న ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గురువారం జంగంరాజు పల్లె పరిసర ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు, కంపచెట్లు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాల సుబ్బయ్య, వీర లక్ష్మి, శారద, విద్యార్థులు పరిసరాలను శుభ్రం చేశారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మైదుకూరు అర్బన్ సిఐ రమణారెడ్డి సూచించారు. పట్టణ పరిధిలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో గురువారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ బాలికలు అంతర్జాలంలో అనవసరపు యాప్‌ల జోలికి పోకూడదన్నారు. విజ్ఞానానికి అవసరమైన వాటిని మాత్రమే ఉపయోగించుకోవాలన్నారు. ఫేస్‌బుక్, వాట్సప్ వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. కొంతమంది నిరంతరం సెల్‌ఫోనుకు అలవాటు పడి ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తల్లిదండ్రుల, విద్యార్థుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థి దశలోనే ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తేవాలన్నారు. పోటీ పరీక్షల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐ రమణారెడ్డి

ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం శివమునెమ్మ

ఎస్‌జిఎఫ్ క్రీడల్లో జిల్లా స్థాయికి విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - వేంపల్లె

పులివెందుల నియోజకవర్గస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో జిల్లాస్థాయికి వేంపల్లె బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శివమునెమ్మ తెలిపారు. మంగళవారం పులివెందులలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గం క్రీడా పోటీల్లో తమ విద్యార్థులు జిల్లాస్థాయికి వివిధ విభాగాల్లో ఎంపికయ్యారని పేర్కొన్నారు. అండర్-14 కబడ్డీ విభాగంలో గుణశేఖర్, అండర్-17 కబడ్డీ విభాగంలో గంగా మధుసూదన్ రెడ్డి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అండర్-14 బ్యాట్మెంటన్ (షటిల్) విభాగంలో వంశి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. అండర్-17 యోగా విభాగంలో భాస్కర్‌కుమార్, ధీరజ్‌కుమార్ జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరందరూ త్వరలో జరగబోయే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్నారని చెప్పారు. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులతోపాటు ఫిజికల్ డైరెక్టర్ నిశాల్, ప్రమీలకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.


పాలకేంద్రం దగ్గర తనిఖీ చేస్తున్న కమిషనర్ డి.రాముడు

స్వచ్ఛమైన పాలను విక్రయించాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రజలకు స్వచ్ఛమైన పాలు అందివ్వాలని మున్సిపల్ కమిషనర్ డి.రాముడు సూచించారు. పట్టణంలో గురువారం మారుతి హాల్ రోడ్డులోని పాల విక్రయ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ప్రజలకు స్వచ్ఛమైన కల్తీ లేని పాలను విక్రయించాలని సూచించారు. ప్రభుత్వం నిషేధించిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను వాడరాదన్నారు. క్యారియర్, వాటర్ బాటిల్ తెచ్చుకోవాలని వినియోగదారులకు సూచించాలని తెలిపారు. సచివాలయ శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

సమాజసేవలో భాగస్వాములవడం హర్షణీయం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

శ్రీషిర్డీ సాయి కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శిబిరం ద్వారా సమాజసేవలో భాగస్వాములు కావడం ఆనందదాయకమని ఎంపీటీసీ లక్ష్మీదేవి తెలిపారు. ఉప్పలపాడు గ్రామంలో గురువారం ఎన్ఎస్ఎస్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవితోపాటు ఆ గ్రామ పెద్ద ఎంబి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఎస్ఉప్పలపాడు ఆదర్శ గ్రామంగా ఉందన్నారు. కళాశాల డైరెక్టర్ గ్రామంలోని యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆ కళాశాల డైరెక్టర్ కె.సంజీవరెడ్డి ప్రిన్సిపల్ సుధాకు అభినందనలు తెలిపారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో జెఎల్ఎంకు గాయాలు

ప్రజాశక్తి - వేంపల్లె

గాయపడిన హరి నారాయణ

చింతలమడుగుపల్లె సబ్‌స్టేషన్‌లో పరిధిలో పని చేస్తున్న గ్రేడ్-2 జెఎల్ఎం హరి నారాయణకు నేలవరం తండా వద్ద విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తుండగా విద్యు దాఘాతానికి గురయ్యాడు. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే విద్యుత్ షాక్ తగిలిందని బంధువులు పేర్కొంటున్నారు. లైన్‌మెన్ నుంచి ఎల్‌సి తీసుకొని కరెంటు స్తంభాన్ని ఎక్కి మరమ్మతులు చేస్తుండగా గురువారం మధ్యాహ్నం ఈ ప్రమాదం జరిగింది. కరెంట్ స్తంభంపై నుంచి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వీపు భాగం చర్మం కాలిపోయింది. స్థానికుల సాయంతో 108 వాహనంలో హరి నారాయణను వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు ప్రాథమిక చికిత్స అనంతరం కడపకు తీసుకెళ్లారు. లైన్ క్లియరెన్స్ ఇవ్వకుండానే విద్యుత్ స్తంభం ఎక్కిం చడంతోనే ఈ ప్రమాదం జరిగిందని బంధువులు వాపోతున్నారు.